క్లుప్తంగా

ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా గున్నబాబు



వాగు గున్నబాబు, పులవర్తి శ్రీనులను అభినందిస్తున్న ఆర్యవైశ్యులు

ఏలేశ్వరం: ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా వాగు గున్నబాబు ఎన్నికయ్యారు. కాకినాడలో గురువారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణానికి చెందిన వాగు గున్నబాబు ఉపాధ్యక్షుడిగా, లింగంపర్తికి చెందిన పులవర్తి శ్రీను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. వీరిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో పూర నానాజీ, మాటూరి సూరిబాబు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య నియమాలు పాటించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారి శైలజ

ఏలేశ్వరం: గర్భిణులు ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా సహజ ప్రసవం జరుగుతుందని సీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో గురువారం గర్భిణులు ఆరోగ్య పరంగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సహజ ప్రసవం జరగాలంటే ఆరోగ్య సూత్రాలు, నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు హారిక, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పెద్దనాపల్లిలో ధర్మరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లిలో గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గొల్లపల్లి ధర్మరాజు కుటుంబ సభ్యులను గిరిబాబు పరామర్శించి సానుభూతి తెలిపారు. ధర్మరాజు మృతి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, దోశ కిషోర్, గొల్లపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



తామరాడలో రైతుకు చిన్నట్రాక్టర్, విత్తనాలు పంపిణీ చేస్తున్న నెహ్రూ

కిర్లంపూడి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శ్రీకారం చుట్టారు. మండల వ్యవసాయశాఖ అధికారి జోశా అమృత ఆధ్వర్యంలో తామరాడకు చెందిన జొన్నాల స్వామికి చిన్నట్రాక్టర్‌ను అందజేశారు. పలువురు రైతులకు మినుము విత్తనాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతి, యువకుడి అదృశ్యంపై కేసు

కోటనందూరు: యువతి, యువకుడు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్సై టి.రామకృష్ణ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కాకరాపల్లి గ్రామానికి చెందిన షేక్ నాగీనా (19) బుధవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌కు వెళ్లొస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అదే గ్రామానికి చెందిన పాలూరి వెంకట ఫణీంద్ర (20) సాయంత్రం 7.30 గంటలకు బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి షేక్ మీరాబీ, యువకుడి తండ్రి పాలూరి వాసు స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తీర్మానాలు, సంతకాలకేనా ?

- ప్రజాప్రతినిధులు అందుకేనా ?
- అధికారులను నిలదీసిన సభ్యులు
- వాడీవేడిగా బడ్జెట్ సమావేశం



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము

తుని రూరల్: ప్రజలతో ఎన్నికైన తాము తీర్మానాలు ఆమోదం, సంతకాలకేనా అని ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన 2024–25 ఆర్థిక సంవత్సరం సవరణ, 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రతిపాదిత బడ్జెట్ సమావేశం జరిగింది. బడ్జెట్ వివరాలను ఏఓ శేషగిరిరావు చదివి వినిపించారు. రూ.20 వేలు మిగులు బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మండల పరిషత్ సాధారణ నిధుల్లో 23 శాతం అభివృద్ధి పనులకు, 12 శాతం అత్యవసర మంచినీటి అవసరాలకు, 15 శాతం స్త్రీ, శిశు సంక్షేమం, 15 శాతం ఎస్సీ, ఆరు శాతం ఎస్టీ, 15 శాతం కార్యనిర్వహణ, నాలుగు శాతం కంటింజెంట్, పది శాతం అత్యవసర కార్యనిర్వాహక ఖర్చులకు కేటాయించారు. 15 ఆర్థిక సంఘం నిధులు రూ.82,96,479లను అన్ని గ్రామాల్లో తాగునీరు, కాలువల నిర్మాణాలకు ప్రతిపాదించినట్టు ఎంపీడీఓ కె.సాయి నవీన్ ప్రకటించారు. సభ్యులు సూచించిన పనులకు ఈ నిధులను వినియోగిస్తామన్నారు.

అధికార పార్టీ నేతలదే పెత్తనం

ఎస్.సూరవరం ఎంపీటీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నిధులతో చేసే పనులకు తీర్మానాలు, సంతకాలకేనా ? మా అభిప్రాయాలకు గౌరవం ఇవ్వరా ? అంటూ ప్రశ్నించారు. ప్రజలకు అవసరమైన పనులు చేసేందుకు ప్రజలతో ఎన్నికైన సర్పంచ్‌లకు, ఎంపీటీసీలను అధికారులు సంప్రదించడం లేదని, అధికారపక్ష నాయకులదే ఇష్టారాజ్యంగా ఉందని ఆరోపించారు. సమాచార లోపం వస్తుందోమోగాని గౌరవ సభ్యులు సూచనలు, సలహాలతోనే ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీపీ జోక్యం చేసుకుని సభ్యులు శాంతంగా ఉండాలని, సర్పంచులు, ఎంపీటీసీల సూచనలతో పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి మాట్లాడుతూ తనకు కేటాయించిన ప్రత్యేక గదిని అర్థంతరంగా ఎందుకు ఖాళీ చేశారని, గది కేటాయించినప్పుడు రూ.రెండు లక్షలతో మరమ్మతులు, ఇతరేతర పనులు చేయించినట్టు ఆమె పేర్కొన్నారు. ఏ కారణంగా గది ఖాళీ చేశారో, ఖర్చు చేసిన డబ్బు సంగతి ఏమిటని ప్రశ్నించారు. వీడియో కాన్ఫరెన్స్ అవసరాలకు గదిని వినియోగిస్తున్నామని, తాను విధుల్లోకి చేరకముందు నుంచి ఇలానే ఉందని ఎంపీడీఓ సాయి నవీన్ వివరణ ఇచ్చారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఐక్యంగా పని చేయాలన్నారు. వైస్ ఎంపీపీలు చిటికెల సత్యవతి, చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, తహసీల్దార్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శివాజీ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు

గండేపల్లి: మామిడి, జీడి మామిడి రైతులు సాగులో తమ సూచనలు, సలహాలు పాటించి తెగుళ్లను నివారించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన అధికారి లావణ్య అన్నారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి తోటలపై తేనె మంచు పురుగు, తామర పురుగుల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. వీటి ఉధృతి కారణంగా మామిడి కాయలు కుళ్లిపోతున్నట్టు గుర్తించామన్నారు. తేనెమంచు, తామర పురుగుల నుంచి పంటలను కాపాడుకునేందుకు లీటర్ నీటిలో 2 మిల్లీ లీటర్ల (ఎంఎల్) ఫిప్రోనిల్ లేదా తయోమెతాక్సమ్ 0.3 ఎంఎల్ గాని, సైనోసాడ్ 0.3 ఎంఎల్ గాని, కొరాజన్ 1.8 ఎంఎల్ గాని పిచికారీ చేయాలన్నారు. వీటితో పాటు సర్ఫపొడి, వేపనూనె కలిపితే మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పండుఈగ తెగులు నివారణకు నీలం రంగు జిగురు అట్టలు మామిడి చెట్లకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జీడీ మామిడి తోటలపై బ్యాక్టీరియా (వ్యాధి) ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. దీని కారణంగా పిక్క మాడిపోతుందని, బ్యాక్టీరియా నివారణకు క్లోరోతాలోనిల్ ఒక లీటర్ నీటిలో 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



రాజవరంలో ముద్రగడ, యనమల కృష్ణుడిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రౌతులపూడి: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని రాజవరంలో గురువారం సంతాన వేణుగోపాలస్వామి దివ్యశిఖర, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నులపండువగా జరిగింది. ముద్రగడ గిరిబాబు, తుని నియోజవకవర్గ వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత వేద పండితులు స్వామివారికి విశేష పూజలు, హోమం, యంత్రస్థాపనం, శిఖర, విగ్రహ ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం గిరిబాబు, యనమల కృష్ణుడు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఆలయ ప్రవేశం చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ముద్రగడ గిరిబాబు, యనమల కృష్ణుడులను శాలువాలతో సత్కరించారు . కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, ఎంఎంఆర్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీ కృష్ణరాజు, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, లోవ దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ లాలం బాబ్జి, పార్టీ మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, నాయకుడు సోమరౌతు తిరుమల వెంకన్నదొర, సర్పంచులు కొరుప్రోలు దేవుడు, సైపురెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలులో జిల్లా జడ్జి తనిఖీలు



ప్రత్తిపాడు సబ్ జైలులో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా జడి సునీత

ప్రత్తిపాడు: స్థానిక సబ్ జైలును జిల్లా జడ్జి గంధం సునీత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులో ఖైదీలకు అందించే ఆహారం, వంటగది, జైలు పరిసరాలను పరిశీలించారు. రిజిస్టర్లు, రికార్డులు తనిఖీ చేసి ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను, ఐలాజ్ ప్రతినిధులు బుగత శివ, అవసరాల దేవి, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, బార్ కార్యదర్శి బొంగుమూరు మధు బాబు, సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎస్‌కే బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు జడ్జి నివాస ప్రాంగణం ప్రారంభం

ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో రోడ్లు, భవనాల శాఖ నిధులు రూ.1.15 కోట్లతో నిర్మించిన జడ్జి నివాస ప్రాంగణాన్ని జిల్లా జడ్జి గంధం సునీత ప్రారంభించారు. స్థానిక కోర్టు జడ్జి కాటం భాను, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, సీఐ బి.సూర్య అప్పారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ రాఘవరావు, ఏఈ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ కార్మికుల సమ్మె విరమణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కుప్పల నాగభూషణం

ఏలేశ్వరం: క్వారీ యాజమానులు సానుకూలంగా స్పందించడంతో కార్మికుల చేస్తున్న సమ్మెను విరమించినట్టు ఉభయ గోదావరి జిల్లాల క్వారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుప్పల నాగభూషణం తెలిపారు. స్థానిక క్వారీ కార్మిక భవనంలో గురువారం ఆయన మాట్లాడుతూ కార్మికుల డిమాండ్ మేరకు నూతన వేతన ఒప్పందం జరిగిందన్నారు. నూతన వేతన ఒప్పందంతో కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. నూతన ఒప్పందం ప్రకారం పాల్స్ రాయి టన్నుకు రూ.6 పెరిగి రూ.104, బోనస్ రూ.500 పెరిగి రూ.6 వేలు వస్తుందన్నారు. కార్మికుల రోజుకూలీ రూ.125 పెరిగి రూ.1000 వరకూ వస్తుందన్నారు. దీంతో పాటు పలు డిమాండ్లను యాజమానులు అంగీకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేరంగుల రాజు, బత్తుల రాజబాబు, నీలపల్లి సుబ్బారావు, మైలపల్లి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి



ఏలేశ్వరంలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

ఏలేశ్వరం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిజనిర్ధారణ చేయాలని మండల పాస్టర్ల ఫెలోషిప్, క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. ఫెలోషిప్, లూథరన్ సంఘాల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో భారీ శాంతి ర్యాలీ చేసి స్థానిక బాలాజీ చౌక్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లావరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ రెండు రాష్ట్రాలను కుదిపేసిన ఈ సంఘటనపై పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కార్యాచరణ చేపట్టేందుకు క్రైస్తవులు శాంతియుతంగా ఉన్నారన్నారు. సంఘటన జరిగి పదిరోజులైనా ఇప్పటివరకూ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ దర్యాప్తు, పోస్టుమార్టం వివరాలు వెల్లడించలేదన్నారు. సీఎం స్వయంగా కేసు పర్యవేక్షిస్తున్నారని చెబుతున్నా, పోస్టుమార్టం నివేదిక రాలేదన్నారు. పాస్టర్ మృతిపై మీడియా, సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ప్రభుత్వం నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండా జాన్ వెస్లీ, సెయింట్ లూథరన్ గురుమండల అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్, సుదర్శన్ డేవిడ్ రాజు, వత్సలరావు, సుమలత, సుజాత, త్రిమూర్తులు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం



శంఖవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ తాతారావు

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న రీ సర్వే ద్వారా గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ తాతారావు అన్నారు. శంఖవరంలో గురువారం భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల నుంచి పలు వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్లు తప్పుగా ఉంటే రీ సర్వే ద్వారా పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. రైతుల భూమి ఆన్‌లైన్‌లో లేకపోతే ఆన్‌లైన్ చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న 18 రోజుల్లో భూ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ చింతనీడి కుమార్, కార్యదర్శి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో ఉజ్వల భవితను కోల్పోవద్దు

- జిల్లా ఎస్పీ బిందుమాధవ్
- డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

గండేపల్లి: విద్యార్థులు డ్రగ్స్ మాయలో పడి ఉజ్వల భవిష్యత్తును కోల్పోవద్దని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ సూచించారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ వద్దు బ్రో, శక్తి యాప్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, వాటిని వినియోగించినా, రవాణా చేసినా పడే శిక్షలను సెక్షన్లతో సహా వివరించారు. డ్రగ్స్ కేసులో నేరం రుజువైతే తప్పనిసరిగా శిక్షలు అనుభవించాల్సి ఉంటుందన్నారు. యువత సన్మార్గంలో నడవాలన్నారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విపత్కర సంఘటనలు ఎదురైనప్పుడు కేవలం మొబైల్‌ను షేక్ చేయడం ద్వారా పోలీస్ అధికారుల రక్షణ లభిస్తుందని, ప్రతిఒక్కరూ శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.శేషారెడ్డి, ప్రో చాన్సలర్ ఎన్. సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ట్రైనింగ్ డీఎస్పీ సీహెచ్ జీవన, జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివనాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరుల దోపిడీని అరికట్టాలి

రౌతులపూడి: మండలంలోని ములగపూడి, మల్లంపేట, ఎస్.పైడిపాల, ఉప్పంపాలెం తదితర గ్రామాల్లో అనధికార క్వారీల ద్వారా జరుగుతున్న సహజ వనరుల దోపిడీని అరికట్టాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ డిమాండ్ చేశారు. గురువారం రౌతులపూడిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ఎలాంటి అనుమతులూ లేకుండా సహజ వనరులను దోచుకుంటున్న మైనింగ్ మాఫియాపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ ప్రాంతంలో కొందరు అక్రమార్కులు అనధికారికంగా నల్లరాయి క్వారీలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా రూ.కోట్లు దోచుకుంటున్నారన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి విచ్చలవిడిగా సహజ వనరులను దోచుకుంటున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే అధికారులు క్వారీలపై తనిఖీలు నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఒమ్మంగిలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం పరామర్శించి, రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో మొగలి పెద్ద సత్తిబాబు, మొగలి కృష్ణలకు చెందిన రెండు తాటాకిళ్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. బాధిత కుటుంబాలను మురళీరాజు పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున నగదు, 25 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి సీతారామ రాజు, గంటా గంగబాబు, గొల్లపల్లి రాజుబాబు, ముమ్మిడి వీరబాబు, దారా నూకరాజు, గంటా లచ్చబాబు, నార్లంక వెంకన్నబాబు, గంటా చిట్టిబాబు, తేలేటి శేఖర్, గంటా బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తుని: స్థానిక సాయినగర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు. పట్టణంలోని ఎల్ఐసీ సెంటర్, ఆర్‌ఎస్ పేట, జీఎన్‌టీ రోడ్డు, గొల్ల అప్పారావు సెంటర్, పోస్టాఫీసు వీధి, చేపల మార్కెట్, నక్కిన వీధి, మేదర పేట, తారకరామా నగర్, మెయిన్ రోడ్డు, గరువువీధి, ఫీడర్ రోడ్డు, ఎమ్మార్వో ఆఫీసు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

గోకవరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ వైవీఎస్ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. గోకవరం, తంటికొండ, కొత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా గోకవరం, కృష్ణునిపాలెం, రామన్నపాలెం, చిన్నూరు, కొత్తూరు, రామానుజపురం, వెంకటాపురం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, వీరలంకపల్లి, కొత్తపల్లి, రాజుపాలెం, గంగంపాలెం, ఠాకూరుపాలెం, కామరాజుపేట, జగన్నాథపురం, సూదికొండ, శివరామపట్నం, భూపతిపాలెం, మల్లవరం, తంటికొండ, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, గోపాలపురంతో పాటు దేవీపట్నం మండలంలోని గరగలంపాలెం, అచ్చియ్యపాలెం, ఇందుకూరుపేట, దేవారం, రావిలంక, పొత్తుకొండ, శరభవరం, ఉప్పయ్యపాలెం, నేలకోట గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఏలేశ్వరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలేశ్వరం, యర్రవరం ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా ఉండదన్నారు. నర్సీపట్నం రోడ్, రాజమండ్రి కాలనీ, చైతన్యనగర్, క్వారీపేట, లింగంపర్తి రోడ్, మార్కెట్ రోడ్, శివాలయం, దిబ్బలపాలెం , లక్కవరంకాలనీ, కాలేజ్ రోడ్డు, షిర్డీనగర్‌లోని కొంతభాగం, యర్రవరంలోని కొన్ని వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు కు విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు

తొండంగి: శ్రీరామనవమి వేడుకలకు గ్రామాల్లో జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. రామాలయాలకు రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని రావికంపాడులో ఏటా శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా వేడుకలకు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే గోపాలపట్నం, తొండంగి, ఎ.కొత్తపల్లి, సీతారాంపురం, కొమ్మనాపల్లి, రావికంపాడు, పి.ఇ.చిన్నాయపాలెం, పైడికొండ, వేమవరం, పెరుమాళ్లపురం, దానవాయిపేట తదితర గ్రామాల్లోనూ శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు

సాక్షి ఇంపాక్ట్



ఎంపీడీఓ వెంకటనారాయణ

కోటనందూరు: అర్హులైన ఉపాధి కూలీలందరికీ పనులు కల్పిస్తామని ఎంపీడీఓ, ప్రాజెక్టు అధికారి వెంకటనారాయణ పేర్కొన్నారు. గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అక్రమాలకు ఉపాధి' కథనంపై ఆయన స్పందించారు. పల్లెల్లో నిబంధనల మేరకు మాత్రమే ఉపాధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. 100 రోజులు పూర్తయ్యే వరకూ ప్రతి కూలీకి పని కల్పిస్తామన్నారు. పనులను నిరంతరం పరిశీలించి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి పనులపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు లేవని, పూర్తి పారదర్శకంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆరోపణలు లేని, అర్హులైన వ్యక్తులే ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. అర్హులైన కూలీలకు పనులు కల్పించకపోయినా, పనులకు రాని వాళ్లకు మస్తర్లు వేసినా, నిబంధనలకు విరుద్ధమైన ప్రాంతాల్లో పనులు చేసినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఉపాధి పనులను నిరంతరం పర్యవేక్షించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.

వరివడిగా కోతలు



బెండపూడిలో మెషీన్‌తో రబీ వరికోతలు

తొండంగి: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో రబీ వరికోతలు జోరుగా సాగుతున్నాయి. మండలవ్యాప్తంగా పంపా, పీబీసీ, వ్యవసాయబోర్ల పరిధిలో ఏటా రబీ వరిసాగు జరుగుతోంది. ఈ ఏడాది పంపా రిజర్వాయర్‌లో పుష్కర స్లూయిజ్ పనులు, గేట్ల మరమ్మతులు తదితర కారణాలతో ఆయకట్టుకు రబీలో సాగునీరు అందించలేదు. దీంతో పంపా ఆయకట్టు పరిధిలో రైతులంతా అపరాలు సాగు చేశారు. వ్యవసాయ బోర్లు, పీబీసీ పరిధిలో మాత్రమే రైతులు రబీ వరిసాగు చేశారు. బెండపూడి, పీఈ చిన్నాయపాలెం, రావికంపాడు, ఎ.కొత్తపల్లి, కొమ్మనాపల్లి, సీతారాంపురం, శృంగవృక్షం, తొండంగి తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ బోర్ల పరిధిలో ముందుగా రబీ వరినాట్లు పడటంతో పంట త్వరగానే పక్వానికి వచ్చింది. దీంతో కొద్ది రోజులుగా వరికోత యంత్రాలతో పంటను కోయిస్తున్నారు. కాగా ఇటీవల అడపాదడపా చినుకులు పడడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. త్వరితగతిన పంటను ఒబ్బిడి చేసుకునేందుకు వరికోత యంత్రాలతో కోత కోయిస్తున్నారు. ప్రస్తుతం రైతులు పంట ఒబ్బిడి పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.